



దిక్కులేని.. విశ్వవిద్యాలయాలు..!

విసి, రిజిస్ట్రార్లు లేక పరిపాలనాపరమైన సమస్యలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాలనాధ్యక్షుల్లేక విశ్వవిద్యాలయాలు దిక్కులేనివయ్యాయి. ఉద్యోగుల జీతాలు కూడా అందకుండా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. జిల్లాలో అనంతపురం జెఎన్‌టియు, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. రెండింటిలోనూ వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లు రాజీనామాలు చేశారు. ప్రస్తుతం రెండు చోట్లా ఇన్‌ఛార్జులతో పాలన నడుస్తోంది. ఈ ఇన్‌ఛార్జిలకు కూడా పూర్తి స్థాయి అధికారాల్లేవు. కేవలం లుక్ ఆఫ్టర్‌గా పెట్టారు. కొత్తగా రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లు ఎప్పటికి వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వైస్‌ఛాన్సలర్లు ఉన్నఫలంగా రాజీనామాలు చేసి వెళ్లడం, వాటిని ఆమోదించడంతో ఇన్‌ఛార్జీల పాలన తప్పనిసరైంది. వీరికి పూర్తి స్థాయి అధికారల్లేవు. కొత్త వైస్‌ఛాన్సలర్ల నియామకం జరగాలంటే మరో నాలుగైదు నెలల సమయం పట్టే అవకాశం కన్పిస్తోంది. కొత్త వైస్ ఛాన్సలర్ల నియామకం జరగాలంటే ముందుగా సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ కమిటీ దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు సభ్యులను ఎంపిక చేస్తారు. ఈ మూడు పేర్లలో ఒకరిని గవర్నర్ నియమిస్తారు. ఈ ప్రక్రియ అంతా జరగాలంటే కనీసం మూడు మాసాల సమయం పడుతుంది. ఇప్పటికి సెర్చ్ కమిటీల నియామకం జరగలేదు. దీంతో అది ఏర్పాటై కొత్త వైస్ ఛాన్సలర్ల నియామకం జరిగే వరకు ఇన్‌ఛార్జులతో నెట్టుకురావాల్సి ఉంటుంది.

జీతాలకూ తప్పని తిప్పలు

రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లు లేకపోవడంతో యూనివర్సిటీల్లో ఉద్యోగులకు జీతాలు చెల్లింపునకూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పుడున్న తాత్కాలిక వైస్ ఛాన్సలర్లకు పూర్తి అధికారాల్లేవు. ఏదైనా ఆర్థికపరమైన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారముండదు. దీంతో ఉద్యోగులు, సిబ్బందికి వేతన ఇబ్బందులు తప్పడం లేదు. రెండు విశ్వవిద్యాలయాల్లో కలిపి రెండు వేల మంది వరకు ఉద్యోగులున్నారు. వారికి ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. వచ్చే నెలలో రావాలంటే కూడా ఇప్పుడున్న వైస్ ఛాన్సలర్లకు అధికారాలుండవు. ప్రదానంగా జూన్ మాసంలో ఉద్యోగులు, సిబ్బందికి రుణాలు తీసుకోవాలంటే వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్ల ఆమోదం పొందాల్సి ఉంటుంది. పెన్షనర్ల అరియర్సుపైనా సంతకాలు జరగాల్సి ఉంది. మొదటి త్రైమాసికంకు సంబంధించి ఆర్థికపరమైన అనుమతులు ఉన్నప్పటికీ రెండో త్రైమాసిక ఆర్థిక అనుమతులు రెండు విశ్వవిద్యాలయాల్లోనూ తీసుకుని లేదు. ఇక ఇప్పుడు ఎంసెట్ కౌన్సిలింగ్‌లు జరుగుతున్నాయి. అందులో కళాశాలలో సీట్ల కేటాయింపుల్లో ఏదైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించాలంటే కూడా వైస్‌ఛాన్సలర్ ప్రధానం. ఆ అధికార స్థానం ఖాళీగా ఉండడంతో సమస్యలు నెలకొన్నాయి. ప్రభుత్వం ఎప్పటికి ఛాన్సలర్ల నియామకం చేపడుతుందో అని అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.



ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల

3 ఏళ్లు..10 శాతం పనులు..!

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో మెడికల్ కళాశాలను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి చొప్పన మంజూరు చేసింది. ఇందులో భాగంగా హిందూపురం పార్లమెంట్ పరిధికి సంబంధించి పెనుకొండలో మెడికల్ కళాశాల పనులను మూడేళ్లా రెండు నెలల క్రితం అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి ఆర్భాటంగా ప్రారంభించారు. డిసెంబర్ 2023 నాటికి పూర్తి చేస్తామని ఆరోజు నిర్వహించిన సభలో హామీ ఇచ్చారు. శంకుస్థాపన జరిగి మూడేళ్లు దాటినా ఆ పనులు స్లాబ్ దశ కూడా పూర్తి కాలేదు. పనులు సాగుతున్న తీరు చూస్తే మరో మూడేళ్ల సమయం పట్టినా సందేహం లేదన్న భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది.



వైద్య కళాశాల నమూనా

- కొనసా.....గుతున్న పెనుకొండ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
- భూమిచదును, పునాదుల నిర్మాణంతోనే సరి..
- నిర్దేశించిన గడువు పూర్తయినా స్లాబ్ దశ పూర్తికాని వైనం
- కొత్త ప్రభుత్వమైనా పనులను వేగవంతం చేసేనా .?

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పెనుకొండ పట్టణం మడకశిర రహదారిలోని గొర్రెల పెంపక క్షేత్రంలో 48.49 ఎకరాల భూమిని వైద్య కళాశాలకు కేటాయించారు. 2021 మే 31వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ పద్ధతిలో పెనుకొండ వైద్య కళాశాల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు వైద్య కళాశాలల్లో కొన్నిచోట్ల పనులు పూర్తి అయినప్పటికీ పెనుకొండలో మాత్రం నత్తనడకన ఇంకా సాగుతూనే ఉన్నాయి. నిర్మాణ పనులు ప్రారంభం అయ్యి మూడేళ్ల పూర్తి అయినప్పటికీ పనులు వేగం పుంజు కోలేదు. గత ప్రభుత్వం నిధులు విడుదల జాప్యం చేయడంతోనే పనులు పుంజుకోలేదనే విమర్శలున్నాయి.

మూడేళ్లు దాటినా నత్తనడకనే పనులు

వైద్య కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకారం చుట్టారు. 100 మెడికల్ సీట్లు, 504 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నిర్మాణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 2021 జూన్‌లోనే పనులు మొదలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. టెండర్ల దశలోనే ఏడాదిన్నర సాగింది. టెండర్లు పూర్తి చేసి 2025 ఆగస్టు 2 నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రస్తుతం 6 బ్లాకులు, 3 ఫ్లోర్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు ప్రారంభించారు. 250 మంది కార్మికులు ఇక్కడ పని చేస్తున్నా పనులు వేగవంతం కాలేదు. ఇప్పటి వరకూ 10 శాతం పనులు పూర్తి అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నిర్మాణ పనులు వేగం పెంచినట్లు నిర్మాణ సంస్థ చెబుతన్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కన్పించడం లేదు.

వైద్య తరగతులు..పక్కనే వైద్య చికిత్సలు..

పెనుకొండలో నిర్మిస్తున్న వైద్య కళాశాల నుంచి ఏటా 100మంది వైద్య విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల తరువాత వారంతా ఇక్కడే రెసిడెంట్ డాక్టర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. వీరి కోసం నివాస గృహాలు ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు. నర్సింగ్ విద్యార్థులూ ఇక్కడ శిక్షణ పొందాల్సి ఉంటుంది. దీంతో పాటు రెగ్యులర్ వైద్యులు, సిబ్బంది ఉంటారు. అదే విధంగా రక్త నిధి కేంద్రం, అత్యవసర చికిత్సలు అందిస్తారు.

మంత్రులు చొరవ చూపాలి



రాష్ట్రంలో ఇటీవల వైసిపి ప్రభుత్వం దిగిపోయి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులోనూ ఒకరు పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సవితమ్మ కాగా, మరొకరు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్. ఇద్దరు మంత్రుల పరిధిలోకి ఈ వైద్యకళాశాల నిర్మాణం వస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తన శాఖే కాబట్టి ఎప్పటికప్పుడు పనుల పురోగభివృద్ధిపై చర్చించాలి. మరో మంత్రి సవిత పెనుకొండ స్థానిక ఎమ్మెల్యే కావడంతో మెడికల్ కళాశాల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి గడువు లోపు కళాశాల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. వైద్య కళాశాల నిర్మాణం పూర్తియితే పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుంది.



2025-2026లో ప్రారంభమైయ్యేనా?

వైసిపి ప్రభుత్వంలో మెడికల్ కళాశాల నిర్మాణం పనులను 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. నిధుల విడుదల జాప్యం కారణంగా పనులు వేగం పుంజుకోలేదు. కొత్తగా ఏర్పాడిన తెలుగుదేశం ప్రభుత్వం మెడికల కళాశాల నిర్మాణాలపై దృష్టి సారించి, పనులను వేగవంతం చేసి పూర్తి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. శంకుస్థాపన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 12 వైద్య కళాశాలల్లో 2024లో అడ్మిషన్లు ప్రారంభిస్తామని ప్రకటించారు. పనులు వేగం అందుకోకపోవడంతో 2025-2026 నాటికి కళాశాలను ప్రారంభిస్తామని తేదీని పొడిగించారు. ప్రస్తుతం జరిగిన నిర్మాణ పనులను చూస్తుంటే మరో మూడేళ్లు గడిస్తేగానీ కళాశాలు పూర్తి అయ్యే అవకాశం కనిపించడం లేదు. అది కూడా పూర్తి స్థాయిలో నిధులు వచ్చి, నిరంతరం పనులు జరిగితేనే పనులు పూర్తవుతాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అయినా మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి : కలెక్టర్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే ఇసుకను తరలించుకోవాలని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టిఎస్.చేతన్ హెచ్చరించారు. శుక్రవారం నాడు హిందూపురం ప్రాంతంలో కలెక్టర్ చేతన్ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా రెవెన్యూ కార్యాలయం చేరుకున్న కలెక్టర్ స్థానిక పరిస్థితులపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో కలియ తిరుగుతూ విభాగాల వారీగా పరిశీలన చేశారు. నూతన రెవెన్యూ కార్యాలయంలో పరిశీలించారు. ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది నూతన కార్యాలయంలో విధులు నిర్వహించేలా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. బార్ అసోసియేషన్ నాయకులతో తహశీల్దార్ కార్యలయంలో మాట్లాడారు. అనంతరం స్థానిక కోర్టు ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న న్యాయస్థాన భవనాన్ని పరిశీలించారు. జిల్లా న్యాయమూర్తి సూచన మేరకు కలెక్టర్ కోర్టు ఆవరణలో భవనాలను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ శిథిలం అయిన కోర్టు భవనాలను కూల్చి దాని స్థానంలో నూతన భవనాలను నిర్మాణం చేస్తామన్నారు. ఇందుకోసం రూ.2కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. జిల్లాలో నూతన ఇసుక విధానం ద్వారా ప్రజలకు తక్కువ ధరకే ఇసుక లభిస్తుందన్నారు. ఇసుక నియంత్రణపై గట్టి నిఘ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో మున్సిపాల్టీల వారి ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేపడుతున్నామని వివరించారు. అనుమతులు లేకుండా నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక రవాణాను ఉక్కు పాదంతో అణిచివేస్తామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ పట్టుబడితే కట్టిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణదారులు నిబంధనల మేరకు ఇసుకను తరలించుకోవాలన్నారు. అలా కాకుండా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు అన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఆరోగ్యమిత్ర హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు, ఓపి వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఆసుపత్రిలో అన్న క్యాంటీన్‌ను త్వరలో ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని ఆదేశించారు, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలకు విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నాడు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన బెడ్ షీట్స్, ఆపరేషన్‌కి అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు ఆస్పత్రి అభివద్ధి నిధి నుంచి నిధులు తీసుకోవాలని ఇన్‌ఛార్జి మెడికల్ సూపరిటెండెంట్ డేవిడ్ రాజ్‌కు తెలిపారు. ఆస్పత్రి అభివద్ధి కమిటీకి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దానికి చట్టబద్దత కల్పించాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఈనెల 18,19 తేదీల్లో సత్యసాయి జిల్లాలో రైతు, కౌలు, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో పనిదినాలు 200 రోజులకు పెంచాలని, రోజు వారి వేతనం రూ.600 ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే ప్రక్రియను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్. బాషా, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయకార్యదర్శి జేవీరమణ, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, సీఐటీయూ నాయకులు ఎల్. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయి ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఇండియన్ టాలెంట్ ఒపియాడ్ పరీక్షలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్టు రూపారాజా పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సాయిషమితారెడ్డి, 6వతరగతి చదువుతున్న హెన్సిక రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి నగదు బహుమతి సాధించారన్నారు. ఇంకా ఆరుగురు విద్యార్థులు ఎక్సలెంట్ మెడల్ విన్నర్ అవార్డులు సాధించగా 25 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. 15 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్స్, 15 మంది విద్యార్థులు బ్రాంజ్ మెడల్స్ సాధించి సత్తాచాటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో చైర్మన్ తోపాటు డైరెక్టర్లు రూపారాజ కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ తదితరులు ప్రతిభా విద్యార్థులను అభినందించారు.

చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొస్తాం

మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

నేతన్న సమస్యలు పరిష్కారం చేస్తూ నేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చేనేత మరమగ్గాల కార్మికులు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత ముడి సరుకులకు విపరీతంగా ధరలు పెరిగాయని, ధరల నియంత్రణ చేయాలని ముద్ర లోన్లు ప్రతి కుటుంబానికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేనేత ముడి సరుకులు కొనడానికి ప్రభుత్వం సబ్సిడీని అందించే వారిని ఇప్పుడు కూడా ఇవ్వటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రంలో ఒకే బ్యాంకు ఉండటంవల్ల రుణాలు, బ్యాంకు లావాదేవీలు చేయడం కష్టంగా ఉందని మరో శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేతలకు ఎంతో అండగా ఉన్న ఆప్కో సంస్థను గత వైసిపి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని అన్నారు. ఆప్కో అవినీతి ఒక్కొక్కటే బయటకు తీసి అవినీతిపరుల అంతు చూస్తామని తెలిపారు. అదేవిధంగా చేనేతల కోసం సొసైటీలు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకుంటామని, సబ్సిడీపై ముడి సరుకులు పనిముట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా చేనేతలను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నీరుగంటి చంద్రశేఖర్, కన్వీనర్ సిద్ద లింగప్ప, డివి ఆంజనేయులు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, కిష్టప్ప, బాబయ్య, మాజీ ఎంపీపీ వెంకటేష్, నల్లగొండ రాయాన పల్లి హరికృష్ణ, సోము, మాస్టర్ వీవర్ పల్లె శివ, లక్ష్మన్న, జనార్ధన్, అజయ్, గోరంట్ల శీన, తూముకుంట వెంకట రాముడు, శీలా నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి : చేనేత సమస్యలు పరిష్కరించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక డివిజన్ నాయకులు శీలా నారాయణస్వామి మంత్రి సవితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు సంబంధించిన బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని,పెరిగిన ముడి పట్టు, నూలు, జరీ రేటును క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వమే 50శాతం రాయితీ తో గ్రామ వార్డు సచివాలయాల ద్వారా నేతన్నలకు అందించాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని 45 సంవత్సరాలు నిండిన ప్రతి చేనేత కార్మికునికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక మండల నాయకులు బెస్త కిష్టప్ప, దాసరి సుధాకర్, జింక నాగరాజు, కుమ్మర కిష్టప్ప, కురబ శ్రీనివాసులు, దేవాంగ వెంకటేశు, వడ్డీ రవీంద్ర పాల్గొన్నారు.

బాలయ్య 50 వసంతాల సినీ స్వర్ణోత్సవ సంబరాలు



నందమూరి బాలకృష్ణకు బ్రోచర్ అందిస్తున్న జగన్

ప్రజాశక్తి అనంతపురం

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50 వసంతాల సినీ స్వర్ణోత్సవాల సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్‌బికె హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు జగన్ తెలిపారు. 1974 తాతమ్మ కల చిత్రంతో బాలకృష్ణ నందమూరి తారకరామారావు నట వారసునిగా చిత్ర సీమలో అడుగు పెట్టారన్నారు. అద్భుత నటనతో అంచెలంచెలుగా ఎదిగి తండ్రికి తగ్గ తనయుడుగా ప్రజల మన్ననలు పొందారన్నారు. బాలయ్య సినీ ప్రస్థానం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బాలయ్య అభిమానులను ఒక బృందంగా ఏర్పాడి 50 రోజుల పాటు పెద్దఎత్తున ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ కూడా హైదరాబాద్‌లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు.

రేపు హిందూపురం రానున్న 'బాలయ్య'

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివారం ఉదయం చిలమత్తూరు మండలం సోమఘట్ట చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్ ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. అక్కడ నుండి హిందూపురం పట్టణ సమీపంలోని కొటిపి వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల సముదాయాలను పరిశీలించి అక్కడ నూతనంగా సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తారని చెప్పారు. అనంతరం స్థానిక పరిగి బస్టాండ్ వద్ద రూ. 26 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం స్థానిక నానెప్ప నగర్ లో కైవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు వివరించారు. సాయంత్రం ఎమ్మెల్యే తన కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ప్రకటనలో వివరించాయి.

లాయర్ సుమలతకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుమలత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది జూకూరు సుమలత గత కొన్ని సంవత్సరాలుగా న్యాయవాది వృత్తితో పాటు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ లీగల్ అడ్వైజర్ గా పలు సమస్యలను పరిష్కరిస్తూ మంచి గుర్తింపు పొందింది. అదేవిధంగా బొగ్గారపు జగదీష్ బాబు ద్వారా పౌరులకు సామాజిక సేవ అందిస్తోంది. 12 సంవత్సరాలుగా సుమలత సేవలను గుర్తించిన అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అడ్వకేట్ చక్రవర్తి గౌరవ డాక్టరేట్‌కు ఆమెను ఎంపిక చేశారు. ఈనెల 11వ తేదీ గురువారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు సుమన్ చేతులమీదుగా ఈమె గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ గౌరవప్రదమైన ప్రశంసాపత్ర పురస్కారం అవార్డును పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ డాక్టరేట్ మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

ఆరోగ్య కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని గుడిపల్లి, సోమందేపల్లి నాలుగవ సచివాలయ ఆరోగ్య కేంద్రాలను టాస్క్ ఫోర్స్ టీం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి హరికుమార్, జిల్లా గణాంకాల అధికారి కళాధర్, నేషనల్ హెల్త్ మిషన్ డిపిఒ నాగరాజు, సూపరింటెండెంట్లు రవీంద్ర, రత్నమ్మ, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేంద్ర నాయక్ శుక్రవారం ఆకస్మిక చేశారు. ఓపికి వస్తున్న పేషెంట్లకు అందే వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు

కేజీబీవీ తనిఖీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాడిమర్రి మండలకేంద్రంలోని కెజిబివిని మండల ప్రత్యేక అధికారి విజయేంద్ర ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు ఇందులో భాగంగా వంట, స్టోర్ గదులను పరిశీలించారు. నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా విద్యార్థుల విషయపరిజ్ఞానాన్ని పరిశీలించారు, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మణిమంజరి, ఎంఇఒ కృష్ణమోహన్, వెంకటేష్ , కెజిబివి ప్రిన్సిపల్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం ఏర్పాటు

లేపాక్షి : మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలో నాయి బ్రాహ్మణులు సమావేశమాయ్యారు. ఈసందర్భంగా నాయి బ్రాహ్మణ సంక్షేమ మండల సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా వెంకటరమణప్ప,కమిటీ సభ్యులుగా నాగరాజు, నరసింహమూర్తి, శంకర, ఆంజనేయులు, నరసింహులు, మూర్తి, సతీష్ బాబు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రానికి చెందిన టిడిపి కార్యకర్త మేకల సూరి (57) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్,తుమ్మల మనోహర్, సూర్య శేఖర్ రాజు, వినోద్ బాబు, చికెన్ తిరుపాల్, ఆనంద్, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలత బాయ్ మృతుని కుటుంబానికి 5 వేల రూపాయలు అందజేశారు.

అమరాపురం : మండల పరిధిలోని కాచికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈరన్న గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డికి, జిల్లా అధ్యక్షులు సుధాకర్ ఈరన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ స్థానిక నాయకులు గురుమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, మాలింగప్ప, శివన్న, చిత్తన్న, గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీ

రొద్దం : యుటిఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి. నరేష్ తెలిపారు. పెనుకొండ యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రామాంజనేయులు జ్ఞాపకార్థం జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ పెనుకొండ మండలంలోని గవర్నమెంట్ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో ఆదివారం నుండి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ టోర్నమెంట్‌లో కేవలం పబ్లిక్ హాలిడేస్, ఆదివారాల్లో మాత్రమే నిర్వహించబడుతుందని చెప్పారు. ఈ టోర్నమెంట్ లో అన్ని మండలాలకు సంబందించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు సుధాకర్, సీనియర్ నాయకులు నారాయణ స్వామి, డివిజన్ నాయకులు ఉపేంద్ర, గంగాధర్, ఆది, దేనిష్, ప్రభాకర్ రెడ్డి, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం

సోమందేపల్లి : హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కె పార్థసారథిని పెనుకొండలోని ఆయన కార్యాలయంలో హిందూపురం కురుబ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారితో పాటు పార్టీ నాయకులు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ధర్మవరం టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ అలుపెరగని పోరాటాలు సాగిస్తోందని ఆసంఘం జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పోతుకుంట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ చేస్తున్న పోరాటాల గురించి వివరించారు. యుటిఎఫ్ బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరయండల పరిధిలోని గొట్లూరు, నాగలూరు, ధర్మపురి, రావులచెరువు, దర్శనమల తదితర గ్రామాలలోని పలు ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానిక మండల నాయకులతో కలిసి యుటిఎఫ్ సభ్యత్వాలు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, జనార్దన్ బాబుతో పాటు నాయకులు వెంకట కిషోర్, హరికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

టీచర్‌గా మారిన కలెక్టర్

10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించిన చేతన్

ప్రజాశక్తి - చిలమత్తూరు

శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్‌కుమార్ టీచర్‌గా మారి పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని కస్తూరిబా బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యా బోధన , మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పదో తరగతి చదివే విద్యార్థులకు సాంఘిక శాస్త్రానికి సంబంధించిన ఫెడరలిజంపై బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనా ఉండాలన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చుచేస్తోందని అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు ఉండాలని అన్నారు. జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తన పరిశీలనలో తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత, కెజిబివి ఎస్ఓ సునీత కుమారి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్



ఇసుక స్టాక్ వివరాలు అడిగి తెసుకుంటున్న కలెక్టర్

ఇసుక రీచ్‌ల పరిశీలన

ముదిగుబ్బ : రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రజలకు ఇసుకను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు, తాడిమర్రి మండలంలోని సీసీ రేవు ఇసుక పాయింట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారుల ద్వారా ఇసుక సరఫరాకు సంబంధించిన విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకే పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం నిర్వహణ ఛార్జీలు వసూలు చేస్తూ వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుక సరఫరా చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఉత్తర్వులను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ విషయాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక రవాణాకు కచ్చితంగా అనుమతులు ఉండాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యంగా మైన్స్, (గనుల శాఖ)రెవెన్యూ , ఇరిగేషన్ పోలీస్ తదితర శాఖల సమన్వయంతో ఆయా ఇసుక రీచ్‌ల నుండి ఇసుక సరఫరా పై ప్రత్యేక దృష్టిని సారించి అవసరమైన మేరకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడం కోసం పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ విధానంలో నగదు చెల్లింపులు కచ్చితంగా జరగాలని అలాగే రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అన్నారు

డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం తగదు

జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి


ప్రజాశక్తి-హిందూపురం

వాహన వినియోగదారులు డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వీడి జాగ్రత్తగా వాహనాలను నడపాలని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో హెల్మెట్ల వాడకం – రోడ్డు ప్రమాదాల నివారణ పై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లను ఉపయోగించి వాహనాలను నడపాలన్నారు. అదేవిధంగా సెల్ ఫోన్ లో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నడపవద్దని సూచించారు. కార్లు నడిపే వ్యక్తులు విధిగా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. అజాగ్రత్తగా వాహనాలను నడిపి ప్రమాదాలు జరిగితే ఆయా కుటుంబాలు ఎంతో నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. వాహనదారులు విధిగా లైసెన్సులు పొందడంతో పాటు తమ వాహనాలకు బీమా సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు. 18 ఏళ్ల లోపు మైనర్లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. అలా వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరిగితే ఆయా తల్లితండ్రులను బాధ్యులుగా చేస్తూ చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. వాహనదారులు నిర్లక్ష్యం లేకుండా సురక్షితమంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా చూసుకోవాలన్నారు. దీనికి తోడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని న్యాయమూర్తి సూచించారు. హిందూపురం పట్టణ శివారు ప్రాంతాల్లో యువకులు ద్విచక్ర వాహనాల పోటీలను ఏర్పాటు చేసుకుని ఒక చక్రంపై వాహనాలను నడపడం వంటి విన్యాసాలు చేస్తున్నారని, దీనివల్ల ఎంతో ప్రమాదం ఉందని అన్నారు. పోలీసులు ఆయా కార్యకలాపాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని న్యాయమూర్తి సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డితో పాటు న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించండి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న కోరారు. ఈ మేరకు ఆయన సర్పంచి లక్ష్మీదేవి భర్త చెన్నరాయుడుకు వినతిని అందజేశారు. విగ్రహం చుట్టూ ఉన్న ఫ్లెక్సీల వల్ల వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఫ్లెక్సీలు తొలగింపజేసి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు వెంకటేష్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినతిత్రం అందజేస్తున్న నాయకులు

ఈరలక్కప్పను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

ఎన్నికల్లో తనపై ఓడిపోయిన వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు శుక్రవారం కలిశారు. శుక్రవారం నియోజకవర్గంలో పర్యటిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే రాజు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలకప్ప స్వగ్రామానికి వెళ్లాడు. ఆసమయంలో ఈరలక్కప్ప ఇంటికివెళ్లి పలుకరించారు. ఈసందర్భంగా ఈరలక్కప్ప ఎమ్మెస్ రాజును ఇంటిలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే తాము పోటీ పడ్డామని అన్నారు.



ఈరలక్కప్పతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

సీజలన్ వ్యాధులపై అందరు అప్రమత్తంగా ఉండాలని ఎంఇఒ గంగప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హై స్కూల్ లో విద్యార్థులకు డెంగీ, మలేరియా వ్యాధి నివారణకు ఉచిత హోమియోపతి మందులను పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులతో కలిసి ఎంఇఒ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పట్టణంలో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటి నివారణ కోసం ప్రతి సంవత్సరం ఉచితంగా పాఠశాల విద్యార్థులతో పాటు పట్టణంలో ఉన్నా అన్ని పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా హోమియోపతి మందులతో పాటు వాడే విధానంతో కూడిన కర పత్రాలను సైతం పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా ఈ మందులను వాడితే వ్యాధులను నుంచి నివారణ పొందడానికి సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నిర్వాహకులు తమతో సంప్రదిస్తే మందులను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి మందు వేస్తున్న ఎంఇఒ గంగప్ప

నిత్యావసర సరుకుల విక్రయ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్ లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కార్యదర్శి బాలాజీ, టిడిపి నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రత్యేక కౌంటర్లో రాయితీపై సరకులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ధరల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ప్రజలకు పెరిగిన నిత్యవసరాల భారాన్ని తగ్గించడానికే ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల డిప్యూటి తహశీల్దార్ ఆరతి, టిడిపి పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ రమేష్ కుమార్, అమర్నాథ్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అగళి

అగళి మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో సంబందిత అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం అగళి మండలంలోని శుక్రవారం సుడిగాలి పర్యటన చశారు. అగళిలో కరియమ్మ గుడి ముందర నిరుపయోగంగా ఉన్న ఓవర్ ట్యాంక్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఈ ట్యాంకును తీసివేసి కొత్త ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆదేశించారు. అనంతరం కేజీబీవీ పాఠశాల, హాస్టల్ పరిశీలించారు. విద్యార్థులకు ఉత్తమైన బోధన, వసతి కల్పించాలని సూచించారు. అనంతరం మోడల్ స్కూల్ పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి విద్యాబోధన, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పర్యటించారు. ముందుగా పట్టణంలోనూతనంగా ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. వచ్చేనెల 15వ తేదీ లోపల అన్న క్యాంటీన్ ప్రారంభ కార్యక్రమం ఉన్నందున వెంటనే ఆ కార్యక్రమాలను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం గుడిబండ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. కురుబరపల్లి వడ్రహట్టి సమీపంలోని కాలువ పనులను పరిశీలించి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, కన్వీనర్లు మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, కుమారస్వామి, దుర్గేష్ లక్ష్మీనరసప్ప, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ స్టేషన్ పరిధిలో పోచనపల్లి పెన్నా నది వంతెన వద్ద అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి 1152 టెట్రా పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ రాజశేఖర్ గౌడ్ తెలిపారు. పట్టణానికి చెందిన ఖలీల్ అనే వ్యక్తి స్కూటర్ లో తరలిస్తున్న 12 బాక్సులలో కల 1152 కర్నాటక టెట్రా ప్యాకెట్లను, స్కూటర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.50వేలు ఉంటుందన్నారు. ఈ దాడులలో ఎస్ఐ కమలాకర్ తో పాటు సిబ్బంది చంద్రశేఖర్, ప్రకాష్, రమణ, వెంకటేశం, అంజినేయులు, శాంతి, మంజువాణి పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న సెబ్ పోలీసులు



మాట్లాడుతున్న సెబ్ సిఐ గురుప్రసాద్

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఫట్టణంలోని పద్మావతి మహిళా డిగ్రీకళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మత్తు పదార్థాల ద్వారా వచ్చే అనర్థాలపై సెబ్ సీఐ గురుప్రసాద్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు పలువురు యువతీ యువకులు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున, అధ్యాపకులు, సెబ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మొహర్రం(పీర్ల పండుగ) నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో పీర్ల పండుగ చేయాలనుకునేవారు ముందుగా కమిటిగా ఏర్పడి పోలీస్ స్టేషన్లో అనుమతి తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలకు అవసరమైతే పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లోని మసీదులు. పీర్ల చావిడి వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. ప్రశాంతంగా పీర్ల పండుగను జరుపుకోవాలన్నారు. పీర్ల చావిడి వద్ద రాత్రి సమయంలో గుంపులు గుంపులుగా డీజే సౌండ్లు తప్పెట్లతో డ్యాన్స్ చేయరాదన్నారు. పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మందు తాగి డ్యాన్సు, వీరంగం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలు జరిగినట్లయితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి వారం జరిగే గర్భిణుల వైద్యపరీక్షల సందర్భంగా లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ దాదాపు 75 మంది మహిళలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర డాక్టర్ వెంకట చిరంజీవి , వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, తదితరులతో పాటు ఆశాలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ ఉన్నత పాఠశాల నుంచి మొట్టమొదటిసారిగా ఇద్దరు విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుట్‌ఐటికి అర్హత పొందారని పాఠశాల హెచ్ఎం వివిసి. గిరి తెలిపారు. సాయికిరణ్, ప్రదీప్ అనే విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగము ద్వారా ఎంపికయ్యారని చెప్పారు. ఇందుకు కృషి చేసిన పాఠశాల స్కౌట్ మాస్టర్ ఎన్. గిరిధర్‌ని ఉపాధ్యాయులు అభినందించారు.

బత్తలపల్లి : మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బండి ప్రియాంక ఇడుపులపాయలోని ట్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు తెలిపారు. విద్యార్థిని ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మడకశిర రూరల్ : మడకశిర మండల పరిధిలోని ఆమిదాల గొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు. విద్యార్థులు ఎస్.అరుణ సాయి, జి.హేమంత్ కుమార్ ట్రిబుల్ ఐటీ కళాశాలలో సీట్లు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. వారు సీట్ల సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థిని ట్రిపుల్ ఐటీ కి ఎంపికైంది. పుట్టపర్తి పట్టణంలో వాచెమెన్ గా పనిచేస్తున్న సురేష్ బాబు కుమార్తె గ్రీష్మ 571 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీ కి ఎంపికైంది. విద్యార్థిని ఎంపిక పట్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు, అజీమ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

టిడిపి నాయకుల వార్డు పర్యటన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని 11 వార్డు తోటగేరి తదితర కాలనీల్లో తెలుగుదేశం నాయకులు శుక్రవారం పర్యటించారు. కాలనీల్లో ఉన్న సమస్యలను గుర్తించారు. విద్యుత్, తాగునీటి సమస్యలను, కొత్త ఫించన్ దారులను, వికలాంగుల సర్టిఫికెట్ ల, శానిటేషన్ సమస్యల పరిష్కారానికి సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, వార్డు ఇన్‌ఛార్జులు నరేంద్ర, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, అస్లాం, అరుణ, మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ, మాజీ ఉప సర్పంచి సుబ్రహ్మణ్యం, కోనా పురం నారాయణ స్వామి, తోటగేరి శ్రీనివాసులు, కన్నా స్వామి, చంద్రకాంతమ్మ, లక్ష్మి దేవమ్మ, అశ్వర్థమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం

ప్రజాశక్తి బత్తలపల్లి

విద్యాభివృద్ధికి దాతలు విద్యావంతులు సహకరిస్తే విద్యకు నోచుకోలేని కుటుంబాల విద్యార్థులు రాణిస్తారని ఎంఇఒ సుధాకర్ నాయక్, మాజీ ఎంపీటీసీ లాయర్ సూర్య ప్రకాష్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడైన చిట్టిబాల ఓబిరెడ్డి ఆర్థిక సహకారంతో గ్రామంలోని ఎంపీయుపి స్కూల్ విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, మారినేని కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు కేశవులు, సునీత, వాణి, భాగ్యలక్ష్మి, నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కొత్తచెరువు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధికి కృషి చేసి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు సూచించారు. కొత్త చెరువులోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు జిల్లాలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనానికి పాటుపడాలన్నారు. సినీనటుడు నందమూరి బాలకష్ణ 65వ జన్మదిన వేడుకల కానుకగా జిల్లావ్యాప్తంగా విద్యార్థుల అందరి చేత అమ్మకోసం చెట్టు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో కార్యాలయాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వాణి బాయ్, ఉపాధ్యాయులు విశ్వేశ్వరయ్య, ఇర్షాద్‌వలి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

నంబులపూలకుంట : మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపిపి రాము ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో పలువురు సభ్యులు తమ పంచాయతీ పరిధిలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిపి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేంద్రబాబు, ఎంపీడీవో రాణమ్మతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.